క్లుప్తంగా

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో గోపీకాంత్

కెరమెరి: మండల కేంద్రంలోని సాయిధన్‌సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణంతోపాటు పలు షాపులను ఏవో గోపీకాంత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ రిజిష్టర్లు నమోదు చేయాలన్నారు. తప్పనిసరిగా బిల్‌బుక్ ఉండాలని, విత్తనాలు, మందులు కొనుగోలు చేసిన రైతులకు రసీదు ఇవ్వాలన్నారు. ప్రతీరైతు లైసెన్స్ ఉన్న దుకాణంలో కొనుగోలు చేయాలని, ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలు, మందులనే విక్రయించాలన్నారు. ధరల బోర్డు డిస్‌ప్లే చేయాలన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రంగు సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు, మహిళలు గురువారం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో చేరగా వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు సామల రాజన్న, సోయం చిన్నన్న, మాజీ ఎంపీటీసీ నాయిని భాగ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి



అఫ్షిన్‌ను అభినందిస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో అశోక్ అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో పదో తరగతిలో ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలలో 10 జీపీఏ సాధించిన జోయ అఫ్షిన్‌ను అభినందించారు. హెచ్‌ఎం కిరణ్, ఉపాధ్యాయులు సాయి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి

వాంకిడి: మండలంలోని ధాబా గ్రామంలో శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే దంపతుల విగ్రహావిష్కరణకు ప్రజలు భారీగా తరలిరావాలని మాలీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వడై బాబురావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విగ్రహవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పూలే అభిమానులు, సామాజిక కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ బిల్లు, లోన్లను చెల్లించాలని కోరుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో డీఈవో అశోక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకుడు ప్రకాశ్ ఉన్నారు.

పార్టీల ప్రచారం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో మోవాడ్, బలన్‌పూర్, ఇటిక్యాలతో పాటు పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు వేర్వేరుగా గురువారం ప్రచారం నిర్వహించారు,. నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపట్టారు. బీజేపీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో మండల అధ్యక్షుడు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ నాయకులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత

భీమారం: ఓ యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై బి. రాములు తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వడ్లకొండ పవన్ తన సెల్‌ఫోన్‌ని ఏప్రిల్ 4వ తేదీనా రోడ్డుపై పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్ ఆచూకీ కనుకొన్న పోలీసులు దానిని స్వాధీన పర్చుకొని పవన్‌కి అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ మాచర్ల, పున్నం ఉన్నారు.

రైళ్లు ఆపేదెప్పుడు..?

- మూడో లైన్ పనులతో రద్దయిన రైళ్లు
- బస్సులు, ఆటో ప్రయాణాలే దిక్కు

రెబ్బెన: దూరప్రాంతాలకు వెళ్లాలంటే బస్సు కన్నా రైలు ప్రయాణంతో డబ్బు, సమయం రెండు ఆదా అవుతాయి. అందుకే పలువురు రైళ్లలో ప్రయాణం చేస్తుంటారు. అందుబాటులో ఉన్న రైల్వేస్టేషన్‌కు వెళ్లి ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే రెబ్బెన మండలంలోని ప్రజల పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. రైల్వేస్టేషన్ ఉన్నా రైళ్ల హాల్టింగ్‌ను నిలిపివేయడంతో మండలవాసులకు బస్సు, ఆటో ప్రయాణాలే దిక్కయ్యాయి. దాంతో దూరప్రాంతాల్లో గమ్యస్థానాలకు చేరుకునేందుకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

మూడో లైన్ పనులతో మొదలైన కష్టాలు..

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఉన్న ఏకైక రైల్వేస్టేషన్ రెబ్బెన మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్ మాత్రమే. రెబ్బెన, ఆసిఫాబాద్, వాంకిడి తదితర మండలాల ప్రజలు ఈస్టేషన్ గుండానే హైదరాబాద్, వరంగల్, విజయవాడ, ఖమ్మం, బల్లార్షా, చంద్రపూర్, నాగ్‌పూర్ తదితర ప్రాంతాలకు రైలు ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు రైలు ద్వారా వెళ్లే ప్రయాణికులకు కోసం ఆర్టీసీ యాజమాన్యం ఆసిఫాబాద్ నుంచి రెబ్బెన వరకు ప్రతీరోజు తెల్లవారుజాము భాగ్యనగర్ లింక్ పేరిట ఒక బస్సు ఏర్పాటు చేసింది. అయితే ఖాజీపేట్ నుంచి బల్లార్షా వరకు నిర్మాణం చేపట్టిన మూడో రైల్వేట్రాక్ పనుల కారణంగా నియోజకవర్గ ప్రజలకు మండల కేంద్రం మీదుగా రైలు ప్రయాణం దూరమైంది. కొన్నినెలల క్రితం మొదట్లో ప్యాసింజర్ రైళ్లను కొన్నిరోజుల పాటు నిలిపివేసి తిరిగి పునరుద్ధరించారు. దాంతో ఒకటి రైలు కాకపోయిన మరో రైలు అందుబాటులో ఉండేది. కాని సుమారు మూడు నెలల నుంచి అన్ని రైళ్ల హాల్టింగ్ తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్

అడ్డంకులు ప్యాసింజర్ రైళ్లకు ఎందుకో?

ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్, రేచినీ రైల్వేస్టేషన్ల మధ్యలో ప్రస్తుతం మూడో లైన్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఆసిఫాబాద్ రోడ్ రైల్వేలో దాదాపు పనులు పూర్తయ్యాయి. అయినప్పటికి అధికారులు రైళ్లకు హాల్టింగ్ కల్పించడం లేదు. ఈమార్గం గుండా నిత్యం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు, గూడ్స్ రైళ్లు, ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రం యథావిధిగా నడుస్తున్నాయి. పేద ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్, ఇంటర్‌సిటీ వంటి రైళ్ల రాకపోకలతో మూడో లైన్ పనులకు ఏం అడ్డంకులు కలుగుతున్నాయా అంటూ ప్రయాణికులు మండిపడుతున్నారు. ఆసిఫాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లకు మాత్రమే హాల్టింగ్ సౌకర్యం ఉండగా మూడో లైన్ పనుల కారణంగా రద్దుతో రైలు ప్రయాణానికి పూర్తిగా దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. తప్పనిసరి పరిస్థితుల్లో దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే బెల్లంపల్లి, కాగజ్‌నగర్‌లోని రైల్వేస్టేషన్ గుండా రైలు ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌లో రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందిగా మారింది



ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌లో కొన్ని నెలలుగా అన్ని రైళ్ల హాల్టింగ్‌ను తొలగించడంతో దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. రైలులో వెళ్తే రూ.100 ఖర్చు అయ్యేది. అదే బస్సులో ప్రయాణిస్తే రూ.500 నుంచి 800 వరకు ఖర్చవుతోంది.

– ఇగురపు సంజీవ్, గంగాపూర్

పూర్తిగా రద్దు సరికాదు



మూడో లైన్ నిర్మాణ పనుల పేరుతో రైల్వే అధికారులు పేదలు ప్రయాణించే రైళ్లను రద్దు చేయడం సరికాదు. కొన్ని నెలలకు ముందుకు ఒకటి రెండు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేసి తిరిగి పునరుద్ధరించేవారు. కాని రెండున్నర నెలలుగా ఆసిఫాబాద్‌రోడ్‌లో అన్ని రైళ్లను ఆపడం నిలిపేయడంతో ప్రజలకు ఇబ్బందిగా ఉంది.

– అవిడపు గోపి, రెబ్బెన

రైళ్లను ప్రారంభించాలి



ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్‌లో మూడో లైన్ పనుల కారణంగా నిలిపివేసిన అన్ని రైళ్లను వెంటనే ప్రారంభించాలి. వేసవి సెలవులు మొదలు కావడంతో చాలామంది తమ పిల్లలను తీసుకుని యాత్రలు, దైవదర్శనాలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఇలాంటి సమయంలో రైళ్లు లేకపోవడంతో బస్సుల్లో ఉక్కపోతల నడుమ ప్రయాణాలు సాగించడం కష్టంగా మారుతుంది.

– బుర్స పోషమల్లు, పులికుంట

జన జాతరకు తరలిన నాయకులు



తరలివెళ్తున్న కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు



కెరమెరి: కెలిబి నుంచి బయల్దేరిన కార్యకర్తలు

రెబ్బెన: ఆసిఫాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర కార్యక్రమానికి గురువారం రెబ్బెన మండలం నుంచి పార్టీ నాయకులు, అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు తరలివెళ్లారు. గోలేటిటౌన్‌షిప్ నుంచి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. నాయకులు కిషన్‌గౌడ్, సురేందర్‌రాజు, సాంబగౌడ్, తిరుపతి, జనక్‌ప్రసాద్, లింగంపెల్లి ప్రభాకర్, ప్రకాశ్‌రావు తదితరులు ఉన్నారు.

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 3 వేలకు పైగా నాయకులు, కార్యకర్తలు 288 వివిధ వాహనాలు జీపులు, ఆటోలు, వ్యాన్లు, లారీల్లో బయల్దేరి వెళ్లారు.

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం



జైనూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



కెరమెరి: ఎస్సీ కాలనీలో నాయకుల ప్రచారం

జైనూర్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలిపించాలని కోరుతూ మండల నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఆయా గిరిజన గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఆరు గ్యారంటీల ఆశ చెప్పి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిండా మోసం చేస్తోందన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బీజేపీకి ఓటు వేసిన కుల, మతాలు, దేవుళ్ల పేరిట రాజకీయం చేయడం తప్ప పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఎంపీపీ తిరుమల విశ్వనాథ్, మాజీ సర్పంచి పార్వతీ లక్ష్మణ్, ఉప సర్పంచ్ జుగ్నక సాయిత్రీ, మాజీ ఎంపీపీ అనక కళబాయి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, ఆత్రం దత్తు, మెస్రం దౌలత్‌రావు, గుణవంత్‌రావు, కుమ్ర దేవు, తదితరులు ఉన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని వివిధ వాడల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, నాయకులు పెందోర్ ఆనంద్‌రావు, ఇఫ్తేకార్, రాజయ్య, వినేష్ తదితరులు ఉన్నారు.

ఆత్రం సక్కును గెలిపించండి

చింతలమానెపల్లి: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఆదివాసీ రాష్ట్ర నాయకుడు బుర్స పోచయ్య కోరారు. మండలంలోని బాబాసాగర్ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేసేందుకు ఆయన తన ప్రభుత్వ ఉద్యోగాన్ని త్యాగం చేసి రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యే అయిన ఉద్యమ నాయకుడు ఆత్రం సక్కు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు నెర్పల్లి లచ్చన్న, నీలయ్య, ఎడ్ల మహేశ్, తుమ్మిడె అశోక్ పాల్గొన్నారు.

వామ్మో ఎండలు

- రెడ్ జోన్‌లో జిల్లా
- తిర్యాణిలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత

జిల్లాలో గురువారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

ప్రాంతం	గరిష్టం
తిర్యాణి	45.4
జంబుగా	45.1
ఎల్కపల్లి	44.7
కాగజ్‌నగర్	44.5
ఆసిఫాబాద్	44.5
కుంచవెల్లి	44.1
వంకులం	43.9
కౌటాల	43.8
ధనోరా	43.4
దహెగాం	43.3



ప్రయాణికులు లేకుండా ఆర్టీసీ బస్సు

కౌటాల: భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. రోజురోజుకు ఎండలు దంచికొడుతున్నాయి. వాతావరణ శాఖ కుమురం భీం జిల్లాను రెడ్‌జోన్‌లో ప్రకటించింది. గత మూడు రోజుల నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పలు ప్రాంతాలు హెచ్చరిక జోన్‌లో ఉన్నాయి. గురువారం భారీగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిర్యాణిలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, కాగజ్‌నగర్‌లోని జంబుగాలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతకు ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, చిన్నారులు వడగాడ్పులకు అల్లాడుతున్నారు. తిర్యాణి, కాగజ్‌నగర్ మండలాలు వార్నింగ్ జోన్‌లో ఉండగా మిగతా 13 మండలాలు అలెర్ట్ జోన్‌లో ఉన్నాయి. గురువారం ఆసిఫాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఎంపీ ఎన్నికల ప్రచార సభ ఉండడంతో కార్యకర్తలు, నాయకులు తలపాగా, టోపీలు ధరించి ప్రయాణాలు చేశారు. ఎండ వేడికి కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. పలుచోట్ల రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

ప్రారంభానికి ముందే పగుళ్లు

- శ్మశానవాటికలు రెండేళ్లకే
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

బెజ్జూర్: చివరి మజిలీ అయిన మనిషి అంత్యక్రియలు చేద్దామంటే గతంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఎక్కడ ఖననం చేయాలో తెలియక పేదలు చెరువులు, వాగులు, కాలువల దగ్గర ఎక్కడ స్థలం దొరికితే అక్కడ దుర్భర పరిస్థితుల్లో అంత్యక్రియలు జరిపేవారు. చివరి మజిలీ గౌరవప్రదంగా సాగాలనే ఉద్దేశంతో అప్పటి రాష్ట్రప్రభుత్వం కుమురంభీం జిల్లాలో గత రెండేళ్ల క్రితం 234 శ్మశానవాటికల నిర్మాణాలు చేపట్టింది. అయితే నాసిరకం పనులు, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అవి ప్రారంభానికి ముందే పగుళ్లు తేలాయి. నిర్మించిన రెండు మూడేళ్లకే కూలిపోయే స్థితికి చేరాయి.

నాలుగు గోడల మధ్యనే ఎంబీ రికార్డులు

కాసుల కోసం కక్కుర్తిపడి గత అధికార యంత్రాంగం ఈ పనులను ×మామూలు×గా తీసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు నాలుగు గోడల మధ్య కూర్చొని అసిస్టెంట్ల పర్యవేక్షణతో సరిపెట్టారనే ఆరోపణలు లేకపోలేదు. అసిస్టెంట్లు ఈ పనుల్లో పెత్తనం చెలాయించారనే ప్రచారం బాహాటంగానే సాగుతోంది. కొలతల నుంచి మొదలుపెడితే ఎంబీ రికార్డుల వరకు సంబంధిత అసిస్టెంట్లే నడుపుతున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్, అధికారులకు మధ్య లావాదేవీల్లో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీరాజ్ అధికార యంత్రాంగం అవినీతిమయంగా మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పగుళ్లు తేలిన పెద్దసిద్దాపూర్ శ్మశానవాటిక

సౌకర్యాలు కరువు

గత రెండుమూడేళ్ల క్రితం జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో నిర్మించిన శ్మశానవాటికల్లో సౌకర్యాలు కరువయ్యాయి. అంత్యక్రియల కోసం వచ్చే వారి కోసం ఏర్పాటు చేసిన గదుల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. నీటి సౌకర్యం కోసం ఒక్కో శ్మశానవాటికకు రూ.12.50 లక్షలు కేటాయించగా అవి నీటిపాలయ్యాయి. రూ.లక్షకు రూ.10వేల చొప్పున పర్సెంటేజీ వసూళ్లు చేసినట్లు ఆరోపణలు లేకపోలేదు.

జిల్లాలో..

జిల్లాలో 234 శ్మశానవాటికలున్నాయి. కొన్నిచోట్ల వాగుల వద్ద నిర్మించడంతో అవి పూర్తిగా కొట్టుకుపోయాయి. బెజ్జూర్ మండలం పెద్ద సిద్దాపూర్ శ్మశానవాటిక ఎక్కడికక్కడ పగులు తేలి పూర్తిగా కూలిపోయే స్థితికి చేరుకుంది. మరోవైపు పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. శ్మశానవాటికకు స్నానపు గదులకు నీటి సౌకర్యాలు కల్పించలేదు. బోర్లు అమర్చలేదు. ఎలాంటి సౌకర్యాలు కల్పించనప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం బిల్లులు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ డి.రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా, శ్మశానవాటికలో అక్కడక్కడ కొంత నాణ్యత లోపం ఉంది. అందుకే 10 శాతం బిల్లులు ఆగి ఉన్నాయి. అసిస్టెంట్లపై నిఘా ఉంచుతామన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సమన్యాయం

రెబ్బెన: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సమన్యాయం దక్కుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నాయకులు బుధవారం రాత్రి ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి వారిని పార్టీ లోకి ఆహ్వానించారు. అనంతరం విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాలకు సమన్యాయం దక్కేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను సాగిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పని చేసే ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు పట్టం కట్టాలని కోరారు. మతతత్వ పార్టీలకు ఓటు వేసి విలువైన ఓటు హక్కును ప్రజలు వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సోమయ్య, రాజేష్, చిరంజీవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వప్రసాద్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మైనార్టీ నాయకులు

వృథాగా భగీరథ నీరు

కెరమెరి: మండలంలోని సాకడ (జీ)లో ఏడాది నుంచి మిషన్ భగీరథ పైప్‌లు లీకేజీ అయి నీరు వృథాగా పోతోంది. ఒక చోట నీరు చేరి కొలనులా మారింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. భగీరథ నీరు పొలంలో చేరడంతో పంటలు సరిగా పండవని రైతు చందు ఆందోళనగా చెబుతున్నాడు. ఇప్పటికైన అధికారులు స్పందించి పైపులను సరిచేసి నీటి వృథాకు అడ్డకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.





తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ ఏఎంసీ క్రీడా మైదానంలో గురువారం తైక్వాండ్, సెపక్ తక్రా ఉచిత వేసవి శిక్షణ తరగతులను మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా నచ్చిన క్రీడల్లో శిక్షణ తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. తైక్వాండో, సెపక్ తక్రా క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఒత్తిడిని జయించడానికి క్రీడలు దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో సెపక్ తక్రా కోచ్ బోగే అశోక్, తైక్వాండో సెక్రెటరీ బోగే రాజేష్, ప్రెసిడెంట్ సిద్ధమల్ల చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

సమ్మర్ క్యాంపు సద్వినియోగం చేసుకోండి

మందమర్రిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ సహకారంతో ఏరియాలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో గురువారం ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడల కోచింగ్ క్యాంపులను ప్రారంభించారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరియా జీఎం మనోహర్